క్లుప్తంగా

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ


భూమిపూజ చేస్తున్న నాయకులు

తంగళ్లపల్లి: నిరుపేదల సొంతింటి కల నెరవేర్చడమే సీఎం రేవంత్ రెడ్డి ధ్యేయమని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు సత్తు శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మండలంలోని బస్వాపూర్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ...ప్రభుత్వం త్వరగా ఇంటి నిర్మాణాలకు బిల్లులు మంజూరు చేయడమే కాకుండా ఇసుక ఉచితంగా అందిస్తోందన్నారు. హౌసింగ్ ఏఈ హమీద్, పంచాయతీ కార్యదర్శి వేణు, కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్ గౌడ్, తిరుపతి రెడ్డి, బద్రి, గ్రామస్తులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకులపై కేసులు నమోదు చేయాలి

ముస్తాబాద్: బీఆర్ఎస్ నాయకులపై కాంగ్రెస్ నాయకులు దాడులు చేయడం సిగ్గుచేటని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కల్వకుంట్ల గోపాల్‌రావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలోకి కాంగ్రెస్ నాయకులు దౌర్జన్యంగా వెళ్లడాన్ని అడ్డుకున్న బీఆర్ఎస్ శ్రేణులపై కాంగ్రెస్ నాయకులు దాడులు చేయడం, దానికి పోలీసులు కూడా వత్తాసు పలుకుతూ బీఆర్ఎస్ నాయకులపైనే లాఠీచార్జ్ చేశారన్నారు. దాడులు చేసిన కాంగ్రెస్ నాయకులపై కేసునమోదు చేయాలని డిమాండ్ చేశారు.

ఆర్థికసాయం అందజేత


చెక్కు అందజేస్తున్న అధికారులు, తదితరులు

కోనరావుపేట: మండలంలోని బావుసాయిపేట గ్రామానికి చెందిన పంబాల భూమయ్య గతంలో విద్యుత్‌దాఘాతంతో మృతిచెందగా సెస్ ద్వారా మంజూరైన రూ.5లక్షల చెక్కును మృతుడి భార్య అనితకు సెస్ వైస్ చెర్మన్ దేవర కొండ తిరుపతి మంగళవారం అందజేశారు. ఇక్కడ సెస్ ప్రతినిధులు బైరగోని మల్లయ్య, షేక్ రహీమ్, సెస్ ఏఈ దివ్య, మాజీ సర్పంచ్ కేంద గంగాధర్ నాయకులు గంగాధర్, తిరుపతి, యూసుఫ్, షాదుల్ తదితరులు పాల్గొన్నారు.

పిడుగుపాటుకు గేదె మృతి



వేములవాడరూరల్: మండలంలోని ఫాజుల్‌నగర్‌లో మంగళవారం పిడుగుపడి బుర్ర అనిల్‌కు చెందిన గేదె మృతి చెందింది. దాని విలువ రూ.80వేల వరకు ఉంటుందని ఆవేదన వ్యక్తం చేశాడు.

విద్యుదాఘాతంతో ..

కోనరావుపేట : నిమ్మపల్లిలో విద్యుత్ షాక్ తగిలి రెండు గేదెలు మృతిచెందాయి. గ్రామానికి చెందిన కూస రాంరెడ్డి తన గేదెలను పొలం వద్దకు మేపేందుకు వెళ్లాడు. మేత మేస్తున్న క్రమంలో కింద ఉన్న విద్యుత్‌తీగ తగలడంతో మృతిచెందాయి.

'మాజీ సర్పంచ్‌పై చర్యలు తీసుకోవాలి'

కోనరావుపేట: బీజేపీ నాయకులను అసభ్య పదజాలంతో దూషించిన మాజీ సర్పంచ్ మల్లేశంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బీజేపీ నాయకులు కోనరావుపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బీజేపీ అధ్యక్షుడు మిర్యాల్‌కార్ బాలాజీ మాట్లాడుతూ ఎల్లారెడ్డిపేట మండలం సింగారంలో దర్శన్ గుట్టలపై అక్రమ కట్టడాలను చూసేందుకు వెళ్లిన బీజేపీ నాయకులను మాజీసర్పంచ్ మల్లేశం దూషించారన్నారు.

వేములవాడ రూరల్: బీజేపీ కార్యకర్తలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తిపై వెంటనే చర్యలు తీసుకోవాలని వేములవాడ రూరల్ పోలీస్ స్టేషన్‌లో బీజేపీ నాయకులు ఫిర్యాదు చేశారు. వేముల రూరల్ బీజేపీ మండల అధ్యక్షుడు బూరుగుపల్లి పరమేశ్ ఆధ్వర్యంలో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

తహసీల్దార్‌కు వినతి

బోయినపల్లి: మండలంలో చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో స్థానిక భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి లభించేలా చూడాలని తహసీల్దార్ కాలే నారాయణరెడ్డికి సీపీఎం మండల కన్వీనర్ గురజాల శ్రీధర్ ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికులు మంగళవారం వినతిపత్రం అందించారు. ఆంధ్రా నుంచి వచ్చిన కార్మికులు స్థానిక కార్మికుల పొట్టకొట్టే విధంగా వ్యవహరిస్తున్నారన్నారు. భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు ఎడపెల్లి బాబు, బొజ్జ శ్రీను, రెడ్డవేని కనుకయ్య తదితరున్నారు.

సమస్యను పరిష్కరించాలి

వేములవాడరూరల్ : వేములవాడ మండల పరిషత్ ఆవరణంలో ఉన్న పశు వైద్యశాలపై సాక్షిలో మంగళవారం శిథిలావస్థలో పశువైద్యశాల అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి స్పందించిన కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ స్పందించారు. సమస్యను పరిష్కరించాలని హైదరాబాద్‌లోని పశు సంవర్ధక శాఖ అధికారులకు సూచిస్తూ లేఖ పంపారు.

వినియోగంలో లేక నిరుపయోగం

- మండలకేంద్రంలో వృథాగానే వసతి గృహం, పాఠశాలల భవన సముదాయాలు
- రూ.లక్షలాది రూపాయలతో నిర్మాణం
- పట్టించుకోని అధికారులు


నిరుపయోగంగా వసతి గృహ సముదాయం

గంభీరావుపేట: రూ.లక్షలు వెచ్చించి నిర్మించారు.. దశాబ్దకాలం వినియోగించారు.. కాలక్రమంలో భవనాల వినియోగం విస్మరించారు. ఫలితంగా భవన సముదాయాలు నిరుపయోగంగా మారాయి. చక్కని బిల్డింగులు అంధవిహీనంగా మారిపోయాయి. ప్రభుత్వం, అధికార యంత్రాంగం చొరవ చూపితే ఈ భవనాలు వినియోగంలోకి వచ్చే అవకాశాలు ఉన్నాయి. కానీ అధికారులుగాని, నాయకులు పట్టించుకోవడం లేదు.

రూ.లక్షలాది రూపాయలతో..

మండలకేంద్రంలో రూ.లక్షలాది రూపాయలతో అప్పట్లో బీసీ విద్యార్థుల కోసం వసతి గృహం నిర్మించారు. కొన్నేళ్లు హాస్టల్ కొనసాగింది. తర్వాత బీసీ హాస్టళ్లను ఎత్తివేశారు. ఖాళీగా ఉంటున్న భవనంలో అప్పట్లో ప్రభుత్వ డిగ్రీ కళాశాలను కొనసాగించారు. అనంతరం డిగ్రీ కళాశాలకు పక్కా భవనం సమకూరింది. అక్కడికి తరలివెళ్లారు. అప్పటి నుంచి భవన సముదాయం నిరుపయోగంగా ఉంటుంది. అప్పట్లో దీంట్లో కేజీ టు పీజీ విద్యా సంస్థలకు సంబంధించి హాస్టల్‌ను ఏర్పాటు చేస్తామని అధికారులు, నాయకులు హంగామా చేశారు. తర్వాత ప్రభుత్వం మారింది. దీని గురించి పట్టించుకునే నాథుడే కరువయ్యారు. వందలాది మంది విద్యార్థులతో హాస్టల్, ఒక డిగ్రీ కళాశాల కొనసాగిన భవనం ఇది. నిర్మించి ఇరవై ఏళ్లు కూడా కాలేదు. కానీ పాలకుల పట్టింపు లేని తనమో.. అధికారుల నిర్లక్ష్యమో దీనిపై పట్టింపు కరువైంది. ప్రభుత్వ కార్యాలయాల నిర్వహణకో.. ఇతరత్రా అవసరాలకో వినియోగించుకునే వీలుంది. కానీ ఎవరికీ పట్టింపు లేదు. ఫలింగా చెట్లు పొదలు పెరిగి, చెత్తాచెదారంతో భవనం నిండిపోయింది. అధికారులు ఇప్పటికైనా స్పందించి భవనం వినియోగంలోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


పాఠశాల భవనం

పాఠశాలల భవన సముదాయం

గంభీరావుపేట మండలకేంద్రంలో ప్రాథమిక, జెడ్పీ ఊర్దూ మీడియం పాఠశాలల భవన సముదాయం నిరుపయోగంగా మారింది. అధికారులు, నాయకులు కాస్త చొరవ చూపి ప్రత్యామ్నాయ అవసరాల కోసం వినియోగించుకునే వీలుంది. కానీ ఆ దిశగా ఎవరు ఆలోచించడం లేదు. దాదాపు 10–15 ఏళ్ల క్రితం నిర్మించిన భవన సముదాయం నిరుపయోగంగా మారింది. కేజీ టు పీజీ విద్యా సంస్థల్లో భాగంగా ఈ పాఠశాల నూతన భవన సముదాయంలోకి మారింది. దీంతో వినియోగంలో లేక భవన సముదాయం శిథిలావస్థకు చేరుతోంది. రెండంతస్తుల బిల్డింగ్. దాదాపు ఆరుగదులు. పక్కనే కేజీ టు పీజీ విద్యాసంస్థల ప్రాంగణం. అధికారులు వాటిని వినియోగంలోకి తీసుకొచ్చే వీలుంది. అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అధికారులు స్పందించాలి



లేటేస్ట్ భవనాలే అయినా వీటి గురించి ఎవరూ పట్టించుకోవడం లేదు. కేజీ టు పీజీ విద్యాసంస్థల ఏర్పాటులో భాగంగా విద్యా సంస్థలు అందులోకి మారిపోయాయి. కానీ రూ.లక్షలు విలువ చేసే భవన సముదాయాల గురించి అధికారులు పట్టించుకోవడం లేదు. కేజీ టు పీజీకి అనుబంధంగా ఈ భవన సముదాయాల్లో బీసీ విద్యార్థుల కోసం హాస్టల్ సౌకర్యం కల్పిస్తే బాగుంటుంది.

– రాచర్ల పార్థసారథి శర్మ, గంభీరావుపేట

ప్రత్యామ్నాయం ఆలోచించాలి



అప్పట్లో అవసరాల కోసం నిర్మించిన కొత్త భవనాలు ప్రస్తుతం నిరుపయోగంగా ఉంటున్నాయి. వాటిని ప్రత్యామ్నయ అవసరాల కోసం వినియోగించుకోవడానికి ప్రభుత్వం ఆలోచించాలి. బీసీ హాస్టల్ ఏర్పాటు, ఇతర ప్రభుత్వ కార్యాలయాల నిర్వహణ నిమిత్తం కోసం ఆలోచించాలి.

– చిట్టంపల్లి భిక్షపతి, గంభీరావుపేట

జిల్లా మహాసభలను విజయవంతం చేయాలి

రుద్రంగి: జిల్లా సీపీఐ మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి కడారి రాములు కోరారు. మంగళవారం మండలకేంద్రంలో మహాసభల కరపత్రాన్ని నాయకులతో ఆవిష్కరించారు. సీపీఐ పార్టీ మండల మహాసభ నిర్వహించారు. జూన్ 12, 13న జిల్లాకేంద్రంలో జరగనున్న జిల్లా సీపీఐ మహాసభలకు పార్టీ శ్రేణులు, ప్రజలు పెద్దఎత్తున తరలివాలన్నారు. దేశంలో మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వలేదని, నల్లధనం తీసుకొచ్చి రూ.15 లక్షలు ఇస్తామని మాట తప్పారన్నారు. సీపీఐ మండల కార్యదర్శి అల్లూరి గణేశ్, దర్పల్లి భూమయ్య, దొడ్డి గంగాధర్, ముత్యాల శేఖర్, రాజు, నర్సయ్య, గంగాధర్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.


మహాసభల కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న కడారి రాములు, నాయకులు

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక

సిరిసిల్ల: రాష్ట్రస్థాయిలో నిర్వహించే అథ్లెటిక్ పోటీలకు జిల్లా నుంచి ఆరుగురు విద్యార్థులు ఎంపికైనట్లు కోచ్ బాబు, నవీన్ మంగళవారం తెలిపారు. అండర్–8లో మొగ్గుల అద్వైత్, రిషిక్, అండర్–10లో డి.విహాన్, సుదీక్షిత, అండర్–12లో ఇషాన్, రిషిక్ ఎంపికయ్యారన్నారు. జిల్లాస్థాయిలో ఎస్ఆర్ఆర్ స్పోర్ట్స్ అకాడమీలో శిక్షణ పొంది రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులకు సిరిసిల్ల కళాశాల మైదానంలో మెడల్స్ ప్రదానం చేసి, ప్రశంసాపత్రాలు అందించారు. కబడ్డీఅసోసియేషన్ ఉపాధ్యక్షుడు నారాయణ, క్రీడాకారులు పాల్గొన్నారు.

బోరుబావి ధ్వంసం చేసేందుకు యత్నం

తంగళ్లపల్లి: బస్వాపూర్‌లో ఓ రైతుకు చెందిన బోరు బావిని ధ్వంసం చేయాలని ఓ వ్యక్తి యత్నించాడు. బాధితుడు బూరుగుపెల్లి మహేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. తన వ్యవసాయ క్షేత్రంలో ఉన్న బోరు బావిని బాలమల్లుపల్లె గ్రామానికి చెందిన ఓ వ్యక్తి సోమవారం రాత్రి ధ్వంసం చేసేందుకు యత్నించాడు. పొలం వద్దకు స్థానిక రైతులతో మహేశ్ వెళ్లగా వారిని చూసి బైక్‌ను వదిలి పరారయ్యాడు. బైక్‌లో కత్తి కూడా ఉండడం గమనార్హం. మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో మహేశ్ ఫిర్యాదుచేశాడు. దర్యాప్తు చేస్తున్నట్లు ట్రెయినీ ఎస్సై కె.వినీతా రెడ్డి తెలిపారు.

యువత క్రీడల్లోనూ రాణించాలి

కోనరావుపేట: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని, యువత క్రీడల్లోనూ రాణించాలని వేములవాడ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు అన్నారు. మంగళవారం మండలంలోని నిజామాబాద్‌లో మాజీ సర్పంచ్ కేంద గంగాధర్ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించగా, ముగింపు టోర్నీకి చల్మెడ లక్ష్మీనరసింహారావు హాజరయ్యారు. టోర్నీలో గెలుపొందిన మొదటి విజేత ఫ్రంట్ లైన్ వారియర్స్, రన్నరప్ బహుమతి సుప్రీమ్ స్పాటన్స్‌కు బహుమతులు అందజేశారు.

మాజీ సర్పంచుల అరెస్టు

చందుర్తి: హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో మంగళవారం నిర్వహించే ప్రజావాణికి సర్పంచుల పెండింగ్ బిల్లుల కోసం వెళ్తున్నారన్న సమాచారం మేరకు రామన్నపేట మాజీ సర్పంచ్ దుమ్ము అంజయ్యను, చందుర్తి మాజీ సర్పంచ్ ప్రేమల భర్త సిరికొండ శ్రీనివాస్‌ను మంగళవారం తెల్లవారుజామున పోలీసులు అదుపులోకి తీసుకొన్నారు. అనంతరం సొంత పూచీకత్తుపై వదిలిపెట్టారు.

బీఆర్ఎస్ పాలనలోనే ప్రొటోకాల్ ఉల్లంఘన

ఎల్లారెడ్డిపేట: బీఆర్ఎస్ పాలనలో ఎన్నోసార్లు ప్రొటోకాల్‌ను ఉల్లంఘించారని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు దొమ్మాటి నర్సయ్య అన్నారు. మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య మంత్రి కేటీఆర్‌తో ఎన్నో ప్రభుత్వ వేదికలపై ఉన్నారని, డీసీసీ అధ్యక్షుడు కొండూరి రవీందర్‌రావు పేరును శిలాఫలకాలపై ప్రొటోకాల్ లేకున్నా ఉంచారన్నారు. ఇప్పటికైనా బీఆర్ఎస్ సీఎం రేవంత్‌రెడ్డి ఫొటో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఉంచాలన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ రాంరెడ్డి, నాయకులు బాల్‌రెడ్డి, గౌస్, రాజేందర్, బుచ్చాగౌడ్, తదితరులున్నారు.

యువకుడికి దేహశుద్ధి?

చందుర్తి : బెల్ట్‌షాపు నిర్వాహకులపై అసభ్యంగా ప్రవర్తించిన మండలంలోని నర్సింగపూర్ గ్రామానికి చెందిన యువకుడిని అనంతపల్లి గ్రామస్తులు దేహశుద్ధి చేసి సోమవారం రాత్రి పోలీసులకు అప్పగించినట్లు గ్రామస్తులు తెలిపారు. తాగిన మైకంలో ఉన్న ఆ యువకుడిని పోలీసులు నర్సింగపూర్ గ్రామానికి వెళ్లి యువకుడి తండ్రికి అప్పగించి, మంగళవారం ఉదయం పోలీస్‌స్టేషన్‌కు తీసుకురావాలని ఆదేశించినట్లు తెలిసింది. అనుమానాస్పద స్థితిలో ఉన్నాడని తెలిపితే అదుపులోకి తీసుకుని, అతని తండ్రికి అప్పగించినట్లు పోలీసులు చెబుతున్నారు. ఈమధ్య చందుర్తి పోలీసులు ద్వంద వైఖరి అవలంబిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయమై ఎస్సై అంజయ్యను వివరణ కోరగా బుధవారం తెలుపుతామని దాటవేశారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత వివాదాస్పదం

- దర్శావళిగుట్ట నిర్మాణాలపై రెండు రోజుల క్రితం నోటీసులు
- పోలీసుల బందోబస్తు మధ్య స్టేజీ ధ్వంసం
- గుట్టప్రాంతంలో 144 సెక్షన్
- సింగారంలో ఉద్రిక్తత
- బీజేపీ జిల్లా అధ్యక్షుడితో పాటు నాయకుల అరెస్ట్

ఎల్లారెడ్డిపేట: ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలపై రెవెన్యూ అధికారులు కొరడా ఝుళిపించారు. ప్రభుత్వ భూమిని ఓ వ్యక్తి ఆక్రమించుకుని నిర్మాణాలు చేస్తున్నట్లు తహసీల్దార్‌తోపాటు కలెక్టర్‌కు బీజేపీ నాయకులు ఫిర్యాదు చేశారు. దీనిపై అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైనట్లు నిర్ధారించారు. అక్రమదారుడికి నిర్మాణాలు తొలగించాలని అధికారులు నోటీసులు జారీచేశారు. మంగళవారం తెల్లవారుజామున పోలీసుల బందోబస్తు మధ్య తహసీల్దార్ సుజాత, అధికారుల సమక్షంలో అక్రమ నిర్మాణాలను కూల్చివేశారు. ఈ సంఘటన ఉద్రిక్తతకు దారితీసింది. ఎల్లారెడ్డిపేట మండలం సింగారం శివారులోని దర్శావళిగుట్ట వద్ద 365 సర్వేనంబర్‌లో ఒకరు అక్రమంగా షెడ్లను నిర్మించాడు. 365 సర్వే నంబర్‌లో 51.10 ఎకరాల ప్రభుత్వ భూమికి.. 47 ఎకరాలు మాత్రమే ఉంది. గుట్టపై ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైనట్లు బీజేపీ నాయకులు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఎల్లారెడ్డిపేట తహసీల్దార్ సుజాత ఆధ్వర్యంలో 100 మంది పోలీసుల రక్షణ వలయంలో అక్రమంగా నిర్మించిన షెడ్డును జేసీబీతో మంగళవారం తెల్లవారుజామున నేలమట్టం చేశారు. ఈక్రమంలో గ్రామస్తులు, అధికారుల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. దర్శావళిగుట్ట పరిసరాల్లో 144 సెక్షన్ విధించామని ఎవరూ ఆ ప్రాంతానికి వెళ్లవద్దని తహసీల్దార్ సుజాత సూచించారు. గ్రామంలో గుంపులుగా ఉండొద్దని సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి హెచ్చరించారు.


దర్శావళి గుట్ట వద్ద అక్రమ కట్టడాలను కూల్చివేస్తున్న అధికారులు

వివాదాస్పదమైన మాజీ సర్పంచ్ వ్యాఖ్యలు

సింగారం మాజీ సర్పంచ్ గుల్లపల్లి మల్లేశం వ్యాఖ్యలు వివాదాస్పదంగా మారాయి. బీజేపీ నాయకులు తమ గ్రామానికి వస్తే అంతు చూస్తామంటూ అసభ్య పదజాలంతో దూషించడం ఉద్రిక్తతకు దారితీసింది. మాజీ సర్పంచ్ వ్యాఖ్యలను బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి, పార్టీ నాయకులు తీవ్రంగా పరిగణించారు. గోపి ఆధ్వర్యంలో సింగారం గ్రామానికి బయలుదేరిన నాయకులను పోలీసులు రాగట్లపల్లి వద్ద అడ్డుకునేందుకు ప్రయత్నించగా.. తప్పించుకున్నారు. దర్శావళిగుట్ట వద్దకు వెళ్తున్న గోపితోపాటు మరికొందరిని పోలీసులు అరెస్ట్ చేసి వ్యాన్‌లో స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మాజీ సర్పంచ్ మల్లేశంపై కేసు నమోదు చేస్తామని ఎస్పీ మహేశ్ బీ గీతే హామీతో బీజేపీ నాయకులు ఆందోళన విరమించారు.

పరిస్థితులను సమీక్షించిన ఎస్పీ

ఎస్పీ మహేశ్ బీ గీతే సింగారం గ్రామానికి వచ్చి అక్కడి పరిస్థితులను సమీక్షించారు. డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇద్దరు సీఐలు, ఐదుగురు ఎస్సైలు, 100 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు.


సింగారంలో మోహరించిన పోలీసు బలగాలు

గుట్టను ధ్వంసం చేస్తున్నారు: బీజేపీ జిల్లా అధ్యక్షుడు

దర్శావళిగుట్ట ఆనవాళ్లు లేకుండా కొందరు ప్రభుత్వ భూములను కబ్జాచేసి అక్రమంగా నిర్మాణాలు చేస్తున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి ఆరోపించారు. మతం పేరుతో ప్రజలను మభ్యపెడుతూ అక్కడ సమాధిని పెట్టి చెద్దర్లు కప్పుతున్నారన్నారు. గుట్టపై గతంలో ఆంజనేయస్వామి ఆలయం, లక్ష్మీనర్సింహస్వామి ఆలయాలు ఉండేవని గుర్తు చేశారు. అధికార పార్టీ నాయకులు అక్రమదారుడు, ఒక మతవాదికి మద్దతు పలుకుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ పార్టీపై తీవ్ర వ్యాఖ్యాలు చేసిన మాజీ సర్పంచ్ మల్లేశంను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు.

కావాలనే కూల్చివేయించారు

భక్తుల కోసం దర్శావళిగుట్టపై సొంత ఖర్చులతో ఏర్పాట్లు చేస్తుంటే కొందరు కావాలనే నిర్మాణాలను కూల్చివేయించారని ప్రముఖ గార్డెన్ డిజైనర్, దర్శావళి దర్గా నిర్వాహకుడు అజీజ్‌భాయ్ పేర్కొన్నారు. అన్ని వర్గాల కార్యక్రమాలకు తనవంతుగా సహాయ సహకారాలు అందిస్తున్నట్లు తెలిపారు. ఇలా కూల్చడం సరికాదన్నారు.


గంభీరావుపేట: గంభీరావుపేట మండల సమాఖ్యకు సంబంధించిన అద్దె వ్యవసాయ వాహనాలు, పరికరాలు ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ.. చెట్టు నీడలో ఉంటున్నాయి. రూ. లక్షల విలువ చేసే వాహనాలకు రక్షణ కరువైంది. ఆపై వాటిని భద్రపరిచే చర్యలు కనిపించడం లేదు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి :
– సుదర్శన్, ఐకేపీ ఏపీఎం, 9704558222

'దాడులకు పాల్పడింది బీఆర్ఎస్ నాయకులే'


సిరిసిల్ల : మాట్లాడుతున్న చొప్పదండి ప్రకాశ్, కాంగ్రెస్ నాయకులు


ముస్తాబాద్ : మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బాల్‌రెడ్డి

సిరిసిల్ల: అధికారంలో ఉన్నా పదేళ్ల ప్రొటోకాల్ పాటించకుండా.. భద్రాచలం రాముడి పెళ్లికి మనువడు హిమాన్షుతో తలంబ్రాలు పంపిన కేసీఆర్, కేటీఆర్ ప్రొటోకాల్ విషయంలో సుద్దులు మాట్లాడుతున్నారని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాశ్ అన్నారు. పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజాసంక్షేమానికి పాటుపడుతున్న కేకే మహేందర్ రెడ్డిని విమర్శించడాన్ని ఆయన ఖండించారు. కేటీఆర్ క్యాంపు ఆఫీస్‌లోసీఎం ఫొటో ఎందుకు పెట్టరని ప్రకాశ్ ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు ఫొటో పెట్టాలని వెళితే బీఆర్ఎస్ నాయకులే గుండాల్లా వ్యవహరించి దాడులకు పాల్పడ్డారని ఆరోపించారు. ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు మాట్లాడుతూ బీఆర్ఎస్ నాయకులకు ప్రొటోకాల్ గురించి మాట్లాడే నైతిక హక్కు లేదన్నారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు గడ్డం నర్సయ్య, భీమవరం శ్రీనివాస్, వైద్య శివప్రసాద్, కత్తెర దేవదాస్, బొప్ప దేవయ్య, ఆడెపు చంద్రకళ–ప్రభాకర్, కల్లూరి చందన, రాపెల్లి ప్రవీణ్, నేరెళ్ల శ్రీకాంత్‌గౌడ్, గోనె ఎల్లప్ప, ఆడెపు జగన్, నీలి రవీందర్, కమలాకర్‌రావు, అన్నల్‌దాస్ భాను, గడ్డం కిరణ్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ముస్తాబాద్: ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిబంధనల మేరకు సీఎం ఫొటో పెట్టాలని భావించిన కాంగ్రెస్ నాయకులపై బీఆర్ఎస్ నాయకులు దాడిచేయడం అప్రజాస్వామికమని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని చూసి ఓర్వలేని బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులపై దాడులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. డీసీసీ ఉపాధ్యక్షుడు రాజిరెడ్డి, ఏఎంసీ చైర్‌పర్సన్ తలారి రాణి, వైస్‌చైర్మన్ వెల్ముల రాంరెడ్డి, కొండల్‌రెడ్డి, నరేశ్, భాను, ప్రశాంత్, రాజు, కొంరయ్య, నర్సింలు, అంజనేయులు, మహేందర్‌రెడ్డి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

తంగళ్లపల్లి: ప్రభుత్వ సొమ్ముతో నిర్మించిన ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ప్రైవేటు బంగ్లాగా మార్చారని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ప్రవీణ్ జేటోని అన్నారు. మండలకేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ సొమ్ముతో నిర్మించిన ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం బర్త్‌డే వేడుకలు, ఇతర కార్యక్రమాలకు అడ్డా కాదని, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సీఎం రేవంత్ రెడ్డి ఫొటో పెట్టకపోవడం శోచనీయమన్నారు. కాంగ్రెస్ నాయకులు గుగ్గిళ్ల శ్రీకాంత్ గౌడ్, బైరినేని రాము, మునిగెల రాజు, సత్తు శ్రీనివాస్ రెడ్డి, మిరాల శ్రీనివాస్, కొత్త రవీందర్, ఇటుకల మహేందర్, పొన్నం లక్ష్మణ్ గౌడ్, నర్సయ్య, భరత్ గౌడ్, కిషన్, తదితరులు పాల్గొన్నారు.

దొంగకు ఏడాది జైలు

సిరిసిల్లకల్చరల్: అమ్మవారి నగల దొంగతనం కేసులో నిందితుడికి ఏడాది జైలు శిక్ష విధిస్తూ ప్రథమ శ్రేణి న్యాయమూర్తి ఎ.ప్రవీణ్ మంగళవారం తీర్పునిచ్చారు. సిరిసిల్లటౌన్ సీఐ కె.కృష్ణ తెలిపిన వివరాలు. స్థానిక మార్కెట్ ఏరియాలోని పెద్దమ్మ ఆలయంలో 2020 జనవరిలో చోరీ జరిగింది. అమ్మవారి గుడి తాళాలు పగులగొట్టి రూ.10వేల విలువైన ఆభరణాలను ఎత్తుకెళ్లాడు. ఆలయ కమిటీ అధ్యక్షుడు దుబ్బ రమేశ్ ఫిర్యాదుతో పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. జగిత్యాల జిల్లా లక్ష్మణ్‌పేట మండలం గుడిరేవుకు చెందిన సిరికొండ నరేశ్ చోరీచేసినట్లు గుర్తించారు. సాక్ష్యాధారాలు పరిశీలించిన తరువాత నిందితుడు నరేశ్‌కు ఏడాది జైలుశిక్షతోపాటు రూ.100 జరిమానా విధిస్తూ న్యాయమూర్తి ప్రవీణ్ తీర్పు వెల్లడించారు.

మరో దొంగకు..

సిరిసిల్ల పట్టణంలోని సాయినగర్‌కు చెందిన అన్నల్‌దాస్ శ్రీనివాస్ తన తండ్రి అంత్యక్రియల కోసం 2020 జనవరిలో స్వగ్రామం కొదురుపాకకు వెళ్లాడు. కార్యక్రమాలు ముగించుకుని ఇంటికి తిరిగి వచ్చి పరిశీలించగా చోరీ జరిగిన విషయం గుర్తించారు. రూ.20వేల విలువైన 8 గ్రాముల బంగారు చైన్, పావు తులం ఉంగరం చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సిద్దిపేటకు చెందిన కెమసారం సురేశ్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సాక్ష్యాధారాలు పరిశీలించిన న్యాయమూర్తి నిందితుడికి ఏడాదిపాటు కారాగార శిక్ష విధిస్తూ తీర్పు వెల్లడించారు.

ఏడాదిలోగా ఇళ్ల నిర్మాణం పూర్తిచేయాలి


మాట్లాడుతున్న ఎంపీడీవో రాజేందర్

గంభీరావుపేట: ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు 45రోజుల లోపు ఇళ్ల నిర్మాణ పనులు చేపట్టి ఏడాదిలోపు పూర్తి చేయాలని ఎంపీడీవో రాజేందర్ సూచించారు. మండలకేంద్రంలోని షాదీఖానాలో మంగళవారం ఇందిరమ్మ లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి అవగాహన సదస్సు నిర్వహించారు. ఇంటి నిర్మాణం 400 చదరపు అడుగు విస్తీర్ణం తగ్గకుండా 600 అడుగులకు మించకుండా ఆర్‌సీసీ స్లాబ్‌తో నిర్మించుకోవాలని, ఇంటి నిర్మాణానికి సంబంధించి మంజూరైన రూ.5 లక్షలు నిర్మాణ దశల్లో లబ్ధిదారునికి చెల్లించనున్నట్లు ఎంపీడీవో తెలిపారు. హౌసింగ్ ఏఈ భవ్య తేజ, ఈవో లక్ష్మణ్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

తెగిపడిన విద్యుత్ వైర్లు

ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాచర్లగొల్లపల్లి శాతవాహన కాలనీలో విద్యుత్ మెయిన్‌వైర్లు తెగిపడ్డాయి. ఆ సమయంలో ఎవరు లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. కాలనీవాసులు వెంటనే సెస్ అధికారులకు సమాచారం అందించగా వెంటనే వచ్చి విద్యుత్ సరఫరా నిలిపివేశారు. అధికారులు, సిబ్బంది మరమ్మతు చేశారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

ముస్తాబాద్: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని హోమియో వైద్యాధికారి శశిప్రియ అన్నారు. మంగళవారం ముస్తాబాద్ గ్రామ పంచాయతీలో యోగాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. యోగా దశాబ్ది ఉత్సవాలు నిర్వహిస్తున్న సందర్భంగా యోగాపై అవగాహన కార్యక్రమాలు చేపట్టామన్నారు. జూన్ 21 వరకు అన్నిగ్రామాల్లో యోగా ఉత్సవాలు నిర్వహిస్తామన్నారు. ఈవో రమేశ్, ఫార్మసిస్టు రాజేశ్వర్, ఇన్‌స్ట్రక్టర్ ధర్మపురి, రవళి, భిక్షపతి, రాజు, రవి తదితరులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలు చేయించాలి

ఇల్లంతకుంట: రైతులు భూసార పరీక్షలు చేయించాలని ఏరువాక కేంద్రం కరీంనగర్ కోఆర్డినేటర్ కె మదన్మోహన్ రెడ్డి అన్నారు. మండలంలోని పొత్తూరులో మంగళవారం మట్టి నమూనాలు సేకరించారు. ఏఈవో లలిత, రైతు రవీందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.